# పోస్టుచెయ్యని ఉత్తరం

ఇందిర ఆ ఇంట్లో అడుగుపెట్టి పదేళ్ళు యిట్టే తిరిగి పోయాయి. పెద్దమార్పులు లేవు. అప్పుడప్పుడు అత్తగారిమీద అలగటం, ఆడబిడ్డని కసరటం, అత్తగారు కూకలెయ్యటం, మరదుల పుస్తకాలు తీసుకు చదవటం, అట్టలు నలిగాయని ఫిర్యాదులు, పనిమనిషి నాగాలు, పెరట్లో కళ్ళాపు చల్లటం, పక్కింటి ముచ్చట్లు చెప్పుకోవటం, దడి అవతల గుడిసెల్లో కొట్లాట విని నవ్వుకోవటం -

కవ్వం కడిగి, చద్దులుపెట్టి, సుద్దులు పెట్టడం, పెరట్లో పెరిగిన మందారం, బోదిగట్టున పెరిగిన కనకాంబరం, గుళ్ళో పూసిన బొడ్డుమల్లీ, మాచిపత్రీ, అన్నీ కలిపి దండ గుచ్చి, వంతులు తెగక, మూతులు ముడుచుకు దండని దేముడిగూటికి తగిలించి, ఆడబిడ్డ సుందరిదే తప్పని తనూ, వదినదే తప్పని సుందరీ, పక్కింటి మాణిక్యానికి చెప్పుకు మెటికలు విరిచి మూతులు తిప్పుకు మళ్ళా అత్తగారు కనకమ్మ గావుకేకకి ఇద్దరి కళ్ళూ కలిసి వకళ్ళవెనుక వకరు పిల్లుల్లా వంటగది గడపలో నిల్చోవటం. అత్తగారి మడిచాలించుకు కొంగు పరుచుకు, వక్క నములుతూ బొగడచెట్టు నీడని వెన్ను వాల్చటంతో మళ్ళా ఎవరి పెద్దరికమూ తేలక ఇందిరా, సుందరీ కీచులాడుకోవటం నిత్యం జరిగేది.

దూరంగా పొలాల్లో మళ్ళు కట్టిన నీటిలో పల్చగా నాటిన వరికుదుళ్ళు వయ్యారంగా తలవంచుకు చిరుగాలికి చిరునవ్వులా కదలటం చూస్తోంది కిటికీలోంచి ఇందిర. తన చిన్న తనంలో కాలవగట్టున వున్నట్టువుంది అంది. "మహ నీకే అన్నీ తెల్సినట్టు చెప్పఖర్లేదు. నాకింకా బాగా కనపడుతోంది. అటు చూడు సూర్యుడు రథాన్ని దిగి తెల్లటి వల్లె చేలపై కప్పి, నీళ్ళని

తన బంగారు పాదాలతో తాకి, వరిపిల్లని దగ్గరకి తీసుకు కెంపుల్లా మెరసే పెదాలతో తాకితే, చిన్నారి, వయ్యారి వరినాటు సిగ్గుతో వంగి వంగి వడిలో దాక్కున్నట్టు లేదు!" అని గర్వంగా సుందరి నుదురుమీదపడే వుంగరాల జుట్టుని పైకి ఎగర వేసుకుంటూ ఇందిరకేసి గర్వంగా చూసింది.

గడపవతల నిల్చిన సుందరి భర్త సూర్యకాంతిలా సుందరిని చేరాడు. కవిత్వం చెపుతున్నావే - అంటూ పరుగు పెట్టే సుందరి కొంగుని పట్టుకున్నాడు.

ఇందిర పెరట్లోకి దూకింది. అత్తగారికి ఆ వార్తచెప్పి ఘనంగా చెట్టుచాటున నిల్చి తొంగిచూస్తోంది. ఆ రోజు మొదలు ఆ ఇంట్లో ఆచారాలని పక్కకినెట్టడం. కనకమ్మ నోరు నొక్కుకుంటూ వచ్చింది.

"ఎంత పని చేశావు నాయనా! అందుకే అప్పుడే ఆ శాంతి కాస్తా చేయించి, ఆనవాయితీ జరిపించేయమని మీ అప్పదగ్గర మొత్తుకున్నా. ఇప్పుడే ఏంతొందర అని పత్తిత్తులా చెప్పింది. ఇప్పుడేం చెయ్యటం?" అంటూ నిస్త్రాణగా మెట్ల పైన కూర్చుంది.

సుందరి భర్త భద్రం సిగ్గుగా నవ్వుతూ "ఏం వంట్లో బాగాలేదా!" అని అత్తగార్ని పరామర్శించి పెరట్లోంచి అక్కగారి ఇంటికి చేరుకున్నాడు.

కనకమ్మకి, ఇరుగూ పొరుక్కి చెప్పి రాద్ధాంతం చెయ్యాలనిపించింది మొదట. మళ్ళీ సుందరి మొహంచూసి అభిమానం పుట్టుకొచ్చి పిచ్చిమొద్దా ఎదురెడతారే అంటూ కూతుర్ని చూసుకు మురిసి, కోడల్ని కూకలేసింది.

ముది పేరక్కా, ముత్తప్ప సాని అల్లే దవడలు నొక్కుకుంటూ నా దగ్గరకి రాకపోతే చూడకూడదని తలుపులు చేర వెయ్యకపోయ్యావు! అని ఇందిర్ని కూకలేసింది.

సిగ్గుతో సుందరి బుగ్గలు గుండ్రపడి, ఎరుపెక్కి, చొట్టలడ్డాయి.

కనకమ్మ పెరటి తలుపు తీసుకు సుందరి ఆడబిడ్డ ఇంటికి వెళ్ళింది.

భద్రం అప్ప, అభిమానంతో తమ్ముడిని వెనకేసుకు మరేం ఫరవాలేదు, కాలం మారిందిగా, వాడికి ఇష్టం వచ్చినట్టే నడుచుకుందాం - అని సమర్ధించింది.

కనకమ్మ పెదిమి విప్పలేదు. చిరునవ్వుతో సిరసావహించింది. నిండు పున్నమి ఐనా నిబ్బరంగా వప్పుకుంది. పందిరిమంచం పెరట్లో పడేయించి కొత్తనవ్వారు నేసిన పట్టి మంచం జతకి ఇరుగూ పొరుగూ ఇళ్ళల్లో వెతికింది. ప్రాణం విసిగి మల్లయ్య దగ్గరవున్న జత మంచాలు ఖరీదుచేసి తెప్పించింది. గోధూళి రేగింది. పడమటి ఆకాశం ఎఱ్ఱశాలువని విసిరింది. తాటితోపు వెనక పెద్దచెరువులో చల్లటి నీటిని తాకి సంధ్యాదేవి వడిలో విశ్రమించే సూర్యభగవానుడిని ఇందిర పెరటివైపు గడపలో నిల్చుని చూస్తోంది.

"ఏమిటే అల్లా నిలువుగుడ్లేసుకు చూస్తున్నావు? ఆ పువ్వులు గుచ్చి సుందరికి పెట్టరాదూ!" అంటూ కనకమ్మ కోడల్ని అదలించింది.

సుందరికి వున్న చీరలు అన్నీ ముందేసుకు ఏదీ నచ్చక తోచక, మోకాళ్ళపైన తలెట్టుకు కూర్చుంది విసుగ్గా.

"శుభమల్లే అల్లుడు ఇంటికివస్తే ఆ కూర్చేడమేమిటే" అని కనకమ్మ కూతుర్ని బుజ్జగించింది.

భద్రం తెచ్చిన చీర అప్పగారిచేత సుందరికి ఇప్పించాడు, తెల్లగా పాముకూసంలా మిలమిల్లాడుతోంది. అంత పల్చటి చీరని ఇందిర చూడలేదు. కథల్లో చదివింది. పురాణాల్లో వింది. మనస్సులో కోరిక వెన్నెల్లా కదిలింది. తనకి ఎవరు కొంటారు; అన్న ప్రశ్న మెరిసి, విచారంగా నల్లగా కరిగి దుఖంలో కలిసిపోయింది.

సుందరి ఆ చీరలోంచి కనపడుతోంది. లంగా మెరుస్తోంది. జాకెట్టుకీ చీరకీ మధ్య పొట్ట మెరుస్తోంది. సూత్రాలు పెద్దగొలుసు వెనక దాక్కున్నాయి.

సుందరి ఆడబిడ్డ సెంటుపూసి బుగ్గగిల్లింది. సిగ్గుతో తలవంచిన కూతుర్ని దూరంనించి చూసుకుంటోంది కనకమ్మ.

వూరు మాటుమణిగింది. పొగమంచు ఇళ్ళపైన వయ్యారంగా వళ్ళు విరుచుకుంటూ కూర్చుంది. చందమామ మంచుముద్దలా తెల్లబడి చలికి దగ్గరగా చేరాడు.

ఉత్తరపు గదిలో దివిటీల్లా దీపాలు మెరుస్తున్నాయి. అగరవత్తులు రైలుయింజన్‌లా పొగని వదులుతూ మనసుల్లో మూసుకున్న గతం తలుపుల్ని తెరిపిస్తున్నాయి.

ఇరుగూ పొరుగు వచ్చారు. పంతులుభార్య ఆరిందాలా, ఆలస్యం ఎందుకు అంటూ విరగపడి నవ్వుతూ సుందరిని గుమ్మంలో వదిలింది.

సుందరి ఆడబిడ్డ కోపంతో గొణిగింది. "కాళ్ళు కడిగించాలి, హారతి ఇప్పించాలి. తాంబూలాలకంటే రవికెబట్టలు తేచ్చేవి అనుకో" - అంటూ సర్దుకుంది.

పూజారి భార్య కనకమ్మపక్క మాట్లాడింది. "అసలు మాటకి చెప్పాలంటే ఈ ఖర్చు అంతా పిల్లాడివేపుదే. పైగా ఏమి వద్దని సాయంత్రం సుద్దులు చెప్పి, ఇప్పుడేమో అవిలేవు, ఇవిలేవు అంటే ఏవన్నమాట! ఆవిడా ఆడదా ఇప్పుడు ఎక్కడ కెళ్లి తెస్తుందేమిటి! ఆ కొడుకా పట్నంవిడిచి రాడాయె. వచ్చినా చిర్రుబుర్రుమనటం తప్ప ఇంటినిపట్టి వుండడాయె" - అంటూ ఇందిరని చూసి విచారంగా పెదిమ విరిచింది.

గది తలుపులు చేరవేసి ఘనంగా కొంగు దులుపుకు పమిట వేసుకుంటూ పెరట్లోకి వెళ్ళింది పంతులు భార్య. అంతా అక్కడ చేరారు.

మాటలు మధ్యాన్నం వంటలదగ్గర్నుండి అత్తగార్ల అదిలింపుల్లోకి వెళ్ళాయి. సుందరి ఆ విషయంలో అదృష్టవంతురాలేనంది పంతులు భార్య.

అబ్బాయి ఈమధ్య వచ్చినట్టు లేదల్లేవుందే కనకమ్మా? అంటూ మామ్మగారు ఆవలించింది. ఇందిర దీపం నీడని నిల్చుంది. మామ్మగార్కి మనసులోనే దణ్ణంపెట్టింది. అత్త గార్కి అబ్బాయి రాలేదన్న దిగులు వుందోలేదో భగవంతునికే తెలియాలి. ఎప్పుడైనా ఇందిరకీ మారు వడ్డించాల్సొచ్చినపుడు కొడుకు ఏం తింటున్నాడో అంటూ వాపోయి, గువ్వలే తింటున్నావు అంటూ కోడలుపై మెటికలు విరవటం అక్కడ వున్న అందరికీ తెలిసిన విషయమైనా, ఎరగనట్లే మాట మారుస్తారు.

కనకమ్మ మాటకారి. ఆకాశమంత గంభీరం వుంది. "పొద్దోయింది, నిద్దరొస్తోంది మామ్మా, వెడతావా; ఇక్కడే మంచం వాల్చమంటావా" - అంటూ నడవాలోకి మంచాన్ని జరుపుకుంది కనకమ్మ.

మాటలు పెంచాలనుకున్న మామ్మ నీళ్లు కారినట్లు ఇంటిమొహం పట్టింది.

పంతులు భార్య సెంటుసీసా వంచుకుని పూసుకుంటూ వెళ్ళిపోయింది.

"వూరికే రావాలి అన్నీ. సిగ్గూ ఎగ్గూలేదు. చూడరాదూ ఆ పూసుకోవటం" అంటూ దవడలు నొక్కుకుంది పూజారి భార్య.

సుందరి ఆడబిడ్డ కనకమ్మ పక్కన కూర్చుంటూ, "అమ్మాయినెల్లుండి తీసుకువెడతాడుట, అన్నీ సిద్ధంచేయించు అత్తయ్యా" అంది.

"అదిగో ఆవిడతో చెప్పు. ఉత్తరాలు వెలగపెడుతోందిగా. ఈనెల్లో పంపేడబ్బు పూర్తిగా పంపేలేదు. ఆయనగారి ఖర్చులు పెరిగాయట. ఐనా తప్పు నాదే. వున్నదీ మన్నదీ అన్నీ అమ్మి వాడిని చదివించానా; వైభోగంగా పెళ్ళిచేశానా, ఆ గాడిదకి ఆ విశ్వాసం ఎక్కడైనా వుందా; ఈ

కుర్రకుంక లిద్దర్నీ పైకి తేవాలన్న ఇంగితం వుందా? ఏదో నా నోటికి జడిసి, ఈమాత్రంగానైనా పంపుతున్నాడు. ఈవిడేమో ఇక్కడుండి కష్టపడిపోతున్నట్టు; మీరు మీరు దెప్పుకోవటం గ్రహించలేకపోలేదు ఈ కనకమ్మ" - అంటూ పూజారిభార్యని దెప్పింది.

"ఏమో ఎవరు అన్నారో బాబు. అందరికి పిల్లలు వున్నారు. ఏనాటికి ఏమి వస్తుందో' అంటూ పూజారి భార్య తప్పుకుని వెళ్ళిపోయింది.

మరుదులు పుస్తకాలు, పక్కబట్టలు తీసుకు చదువుకునేందుకు వెళ్ళిపోయారు. అత్తగారు నడుంవాల్చింది. సుందరి ఆడబిడ్డని ఇంటిదగ్గర దిగబెట్టి, రత్తి తిరిగివచ్చింది. ఇందిర మనస్సులో మబ్బులు కదిలాయి. కంటిపాప కదిలింది. రెప్పలుదాటి నీటిబొట్లు జారుతున్నాయి.

రత్తి గోనె పరచుకుంటూ చిన్నమ్మగార్కి నిద్దర్రాటల్లేదల్లేవుండే - అంటూ చీర ముసుగెట్టుకు ముడుచుకు పడుకుంది.

ఇందిరకి ప్రత్యేకంగా ఏమిలేకపోయినా ఆగదిమాత్రం ఇందిరగదే అని చెపుతారు. రోజా సుందరీ తనూ ఆ పెద్ద మంచంపైన పడుకునే అలవాటు. ఆరోజు ఏమిటో నిద్దర రావటంలేదు. తనుమాత్రం అందరిలా ఎందుకు అడక్కూడదు! ఎన్నేళ్ళు ఇల్లా గడపాలి? అన్న ప్రశ్న మనస్సులో మొండికెత్తి కదులుతోంది.

మరుదులపైన కోపం వచ్చింది. వీళ్ళ చదువు ఏకాలానికి తెమలదు. ప్రతి క్లాసు రెండేసియేళ్ళు చదువుతున్నారు.

ఆ మాట అని అత్తగారి ఎదట బతగ్గలదా! మూర్తి రూపం మనస్సులో దగ్గిరగా కదిలింది. జాలి మసగలా కప్పుతోంది. ఇన్నేళ్ళ తరువాత సూటు కుట్టించు కున్నారుట. ఆ విషయం అత్తగారికి చెప్పవద్దు అని వ్రాస్తే అది రహస్యంగా సుందరి చదివి చెప్పనే చెప్పింది. ఆ రోజు జరిగిన రాద్ధాంతం తల్చుకుంటే ఏడుపొచ్చింది. ఎంతసేపు ఏడ్చింది. మళ్లీ పాడి ఆరిన కళ్ళతో చూరులోకి చూస్తోంది. పోనీ ఈ కొంప అమ్మి చదువుకోకూడదు మరుదులు; ఎవరు చెప్పగలరు అత్తగారికి అనిపించింది. మళ్ళీ మూర్తి పైన అనుమానం, పెద్దభూతంలా కదిలింది. ఎంతపట్నమైనా ఇంతకంటే తక్కువ సంపాదన వాళ్ళు బతకరా, తీసుకు వెళ్ళేందుకు తనకే ఇష్టంలేదు ఏమో. తనంటే ఎందుకో గిట్టదు; అర్థంకాదు. అంతా సుందర్ని పొగుడుతారు. తనకేం తక్కువ; సుందరికంటే తనే తెలుపు. వొకసారి సుందరి ఆడబిడ్డ జడఅల్లుతూ, నీ మొహానవున్న కళ నా మరదలికి లేనేలేదు అనటం గుర్తువచ్చి మరింత దుఃఖం వచ్చింది. ఆ మెప్పు రావాల్సిన చోటునించి వస్తే ఎంత హాయిగా వుంటుంది మనస్సుకి. మూర్తి వ్రాసే వుత్తరాలు అన్నీ వొ మాదిరిగానే వుంటాయి. అమ్మా తమ్ముళ్ళు క్షేమాలతో మూడు వంతులు నిండుతుంది. మిగిలినది తను పడే కష్టాలతో ముగుస్తుంది. చాలా ఏళ్ళకోరికలు నిద్దరోయాయి. సుందరి పెళ్ళైన దగ్గరనుండే, మనస్సు మేలుకుంది.

వద్దన్నా సుందరి భర్తవ్రాసిన వుత్తరం ఇందిరచేత చదివించేది. ఇందిరకి సిగ్గేసేది. కొన్నిచోట్ల చదువుతోంటే కితకితలు పెట్టినట్లు వుండేది. వుత్తరాల్లో ముద్దులేమిటి! అని విస్తుపోయేది. మళ్లీ చదువుకు సెంటుపూసిన చేతిగుడ్డలో చుట్టి దాచుకోవటం చూస్తే తనకి మూర్తి వకటైనా అలాంటిది రాయకూడదా అనిపించేది. అర్ధంలేని ఆలోచనలతో బుఱ్ఱ వేడెక్కి కళ్లు మూతలు పడటంలేదు. ఎదర గదిలోంచి సన్నటి నవ్వులు వినబడుతున్నాయి. సుందరి ఏం చేస్తోందో; ఛా, ఇదేంబుద్ధి అని తన్నితిట్టుకు లెంపలేసుకొంది. మనస్సుని అదుపులో పెట్టేందుకు వుత్తరం మూర్తికి వ్రాద్దామని కూర్చుంది.

ఎన్నో విషయాలు మనస్సులో తిరుగుతున్నాయి. వ్రాసేందుకు ముందుకి ఒక్కటీ

రావటంలేదు. విసుగువచ్చింది. పాత పద్ధతే వ్రాసింది. కొత్తవిషయం సుందరిని భర్త తీసుకెడతాడుట అని, అమ్మయ్య ఈ వుత్తరం అందాకైనా మూర్తిలో మార్పురావచ్చు అని, ఇందిర మనస్సు తృప్తి పడింది.

దూరంగా మిల్లుకూత వినపడుతోంది. కోడి కంఠం విప్పింది. రత్తి వాకిలి చిమ్ముతోంది. వెల్తురు చీకటితో దోబూచులాడుతూ చీకటిని తెలబట్టలో చుట్టినట్లు వెల్తురు పెరుగుతోంది. కనకమ్మ పెరట్లో కంఠం విప్పింది. ఇందిరమత్తు విడింది. పెరట్లోకిచేరింది. సుందరి పొద్దెక్కేదాక లేవలేదు. బామ్మగారు వోసారి తొంగిచూసి ఇంకా లేవలేదా అంటూ దవడలు నొక్కుకుంటూ వెళ్ళిపోయింది.

సుందరి ఆరిందాలా లేచినదగ్గరనుండీ, అతనికి అన్నీ అందిస్తూ అక్కడే తిరుగుతోంది.

కనకమ్మ చిన్నగానవ్వుకుంది కూతురి చనువుచూసుకు.

ఇందిరతో జంకులేకుండా ఎన్నోముచ్చట్లు చెప్పింది. సుందరి చెప్పేదివింటూ సిగ్గుపడింది ఇందిర.

సుందర్ని తీసుకువెళ్ళారు. ఇల్లూ పరిసరాలు నిద్దరోయి నట్లు వున్నాయి. ఇందిరకి పొద్దుపోవటంలేదు. పోనీ వుత్తరాలైనా వస్తాఏమోనని ఎదురుతెన్నులు చూస్తోంది. మూర్తి ఈమధ్య వుత్తరమే రాయలేదు. డబ్బుకూడా రెండు నెలలుగా పంపలేదని, కనకమ్మ చెట్టుకూ గోడకుకూడా చెప్పి తిట్టిపోస్తోంది.

పెద్ద మరది అసభ్యంగా ప్రవర్తించాడని స్కూలునించి పంపేశారు. ఆ మాటవిన్న కనకమ్మ నెత్తీనోరూ బాదుకుంది. పెద్ద కొడుక్కి టెలిగ్రామ్ ఇప్పించింది. జవాబులేదు. సుందరి దయతలచి వో నెలకి వో కార్డువ్రాసింది. తనజీవితం ఎప్పుడూ ఇల్లాగే వుండాలని దేవుడ్ని కోరుకుంటోందిట. కనకమ్మ సంగతులులేవు అని విసుక్కొని కార్డుని కోడలిపైకి విసిరేసింది.

మూర్తి వస్తున్నట్లు రెండుపంక్తులు వ్రాసినకార్డు చాలా కాలంతరువాత వచ్చింది.

ఇందిరమనస్సులో సంతోషం గజ్జెల్లా గలగల్లాడింది. తేదీలులెఖ్ఖపెడుతోంది. కార్డు ఎన్నిసార్లు చదువుకుందో లెక్కపెట్టుకోలేదు అనుకుని తనే నవ్వుకుంటుంది. గది కడిగింది. మంచం ఎండకి వేయించింది. దుప్పటి కొత్తది పరచింది. సుందరి వదిలినఅగరవత్తులు గాజుసీసాలో బియ్యంపోసి గుచ్చింది. తలకి పోసుకోవాలనివుంది. వారంకాలేదని అత్తగారు అరుస్తుందన్న భయంతోచి వూరుకుంది. పొద్దు తిరుగుతోంది. రైళ్ళు గుండెల్లో పరుగెడుతున్నాయి. ఏ చిన్న శబ్దమైనా మనస్సు ఆగి ఎదురుచూస్తోంది.

కనకమ్మ మూతివిరుచుకుంది కోడలి హడావిడికి. వెక్కిరించినట్టు సన్నని నవ్వు ఆ గంభీరమైన మొహంలో కనిపించి మాయమైంది.

ఇందిరకి సహనం తగ్గింది. విసుగ్గావుంది. ఐనా తనవెఱ్ఱి కాకపోతే గతంలోలేని ఆదరణ వక్కసారి పుట్టుకొస్తుందా ఏం; అని సమాధాన పడింది.

పెద్దమరది హడావిడిగా కాయితంతెచ్చి సంతకం పెట్టమంటున్నాడు.

ఇందిర విననట్టు వూరుకుంది.

కనకమ్మ 'తొందరగా పెట్టవేమే, ఏమిసంగతోఏమో' అంటూ గాబరాపడి రొప్పుతోంది.

'ఖంగారుపడేదైతే టెలిగ్రామ్ వస్తుందిలేవే.' అంటూ చిన్నకొడుకు విశద పరిచాడు.

పోష్టు బంట్రోతు చెయ్యిజాపాడు.

ఈసారి అబ్బాయి డబ్బు పంపినప్పుడు మరోబేడ్డబ్బు లిస్తాలే అంటూ మొలతడుముకుంది కనకమ్మ.

ఎప్పుడో ఇస్తాననకపోతే దేముడి గూట్లో వుంటుందిగా, ఇవ్వరాదూ అంటూ చిన్న కొడుకు తల్లికి సలహా ఇచ్చాడు.

'వూరుకో బోడిసలహ అడగలేదు' అంటూ విసుక్కుని పేరు పోతుందన్న అభిమానంతో చిల్లరతెచ్చి పావలాబిళ్ళ విసిరింది కనకమ్మ.

వదినకి పుస్తకం పంపాడేమిటీ అంటూ ఇప్పతున్నాడు పెద్ద మరది.

ఇందిర అతని చేతిలోది తీసుకోబోయింది. అందకుండా పరుగెట్టాడు. కనకమ్మ కసిరింది కోడల్ని. "వాడితో వాదించవద్దు అంటే వినవు. ఏముందో ఏమిటో, ఆ తింగరాడు మళ్ళా తిరిగి ఎప్పటికి వస్తాడో" - అంటూ మెటికలు విరుచుకుంది.

ఇందిరకి దుఃఖం ఆగలేదు. తను అనుకున్నది ఏదీ ఎప్పుడూ జరగదు. అన్నీ తనకే ఎందుకు తటస్థపడతాయో అర్థంకాదు. జాలిపడే నాన్న తనకి లేడు. అమ్మకి తనమీద జాలిలేదు పైగా నీకేంలోటు అంటుంది. అప్పగారికి పిల్లలెక్కువట. వాళ్ళమీదే ప్రేమ. చెల్లెలు చిన్నదిట. పట్నంలో కాపురమని వున్నంతలో పెడుతుంది.

తన్ని గురించి ఎందుకు అనుకోదు; పుట్టినందుకు పెరిగింది, పెరగటం పూర్తి కాకుండానే మూడుముళ్ళు వేయించింది. కాలం జరుగుతోంది. ఏళ్ళు పెరుగుతున్నాయి. ఎప్పుడో వస్తాయి మంచిఘడియాలు అన్న తలపులతో కలలుకన్న రాత్రులు, చీకట్లో నక్షత్రంలా మూర్తితో వంటరిగా సంసారం, ముచ్చట్లు వూహించుకొంటూ ఏళ్ళమధ్య నిచ్చెన్లు పేరుస్తూ గతాన్ని నెట్టింది. మబ్బులేని వర్షంలా కళ్ళవెంట నీళ్ళు ఏకధారగా పడుతున్నాయి.

"శుభమల్లే అబ్బాయి ఏమో పంపితే ఆ ఏడుపేమిటంట? నీ బుద్ధులిల్లా వున్నాయి కనకే వాడి ఉద్యోగానికి ఎదుగూబొదుగూ లేకండా వుంది. నాకు తెలవకడుగుతా; ఏం కష్టపడుతున్నావని ఆ విచారం. పొట్టనిండా మెక్కి మంచమెక్కి బొమ్మల పుస్తకాలు తిప్పుకుంటూ కులకటమేగా" - అంటూ అక్కసు వెళ్ళగక్కింది కనకమ్మ.

వెళ్ళినంత దురుసుగా రాలేదు ఇందిర ఎదటికి పెద్ద మరిది. అర్థంలేని చూపులుచూస్తూ విప్పినకాయితాలు చిందర వందరగా బొత్తులా పట్టుకుని "ఇవి నీకేనా?" అంటూ దిగులుగా తలవంచుకు వదినగారికి అందించాడు.

మొదట బెట్టుచేసింది. వద్దని విదిలించింది. అత్తగారి అదిలింపుకి, విధిలేక మరది ఇచ్చిన కాయితాలకట్ట పుచ్చుకు గదిలోకి వెళ్ళింది ఇందిర.

బైట అత్తగారు అరుస్తోంది. పెద్దమరది తిడుతున్నాడు. కంఠాలు చల్లబడి మాటలు చిన్నవై గుసగుసలాడుకుంటున్నారు. ఇందిర పరాగ్గానే చదువుతోంది. వూహల్లో తియ్యగా తేలుతోంది. మూర్తిని మెచ్చుకుంటోంది. మరోపేజిమధ్యలో మనస్సు నిల్చిపోయింది. నరాలు వణుకుతున్నాయి. మాటలు రావటంలేదు. శ్వాస గట్టిగా వస్తోంది. తన్ని తను మర్చిపోయింది. సంతోషం క్షణికంలా, నక్షత్రాల కాంతిలా దూరంగా ఇంకాఇంకా జరిగి, వెల్తుర్లో కలసి ఆకాశపు అంచులా నిల్చింది. దుఃఖమే చీకటిసముద్రంలా పొంగుతోంది. ఆ పేజీ మళ్ళా చదివింది. నీటిబొట్లకి జాలిగా అక్షరాలు కదులుతున్నాయి. ఇందిర మనస్సు చెదిరింది. గట్టిగా అరచింది. మూర్తిని తిట్టింది. ఆచారిని తిట్టింది. కనకమ్మ గోడలావచ్చింది. నోరు నొక్కుకుంది. అల్లరిచేసుకుంటామా; అని మెల్లిగా కోడల్ని మందలించింది.

ఇందిర అ చేతనంగా బైటకుచూస్తూ వెక్కుతొంది. ఆ పేజీ అక్షరాలు చూడకుండానే చదువుతోంది. ఆచారిచెల్లెలుట. తను వప్పుకోకపోతే చచ్చిపోతుందిట. అవును తనెందుకు బాధపడాలి, ఎవరికోసం వుండాలి. మరొకరికి ఇచ్చుకున్న ఆత్మల్ని యాచించి బతకాలిట. అమ్మ తనకోసం దుఃఖపడుతుందా; ఏమో లోకంకోసం పడాలి.

అమ్మాయి చచ్చిపోతే మూర్తి పిచ్చివాడైపోతాడుట. వాళ్ళపైన తను దయ తలవాలిట. తనపైన దేవుడు దయ తలవాలిట. అమ్మాయికి నచ్చచెప్పి తన్ని తీసుకువెడతాడుట. కడుపులో బాధ కదిలి తిప్పుతోంది ఇందిరకి. ఆ గదిలో కన్న కలలు కాయితాలు కాల్చినట్టు బాధలోనుసిగా మారాయి.

దుఃఖంతో కళ్ళు చీకట్లుకమ్మాయి. వోదార్పుగా ప్రకృతి పరిసరాలని చీకటిగా మార్చింది. వూరునిద్దరోయింది. దీపంగా పెద్దమరిది పిలుస్తున్నాడు, భోంచెయ్యమంటున్నాడు. బొంగురోయిన కంఠంలో దుఃఖం చిందులుతొక్కింది. 'నేను కాదు మీ వదిన వస్తుంది. అంతా విందులు చేద్దురుకాని మరి మాటలురాలేదు. దుఃఖం శబ్దాలుగా మారుతోంది.

కనకమ్మ వెళ్ళమని కొడుకుని కసిరింది. నీ తెలివితక్కువేనని ఇందిరనితిట్టింది. నీకంటే చిన్నది సుందర్ని చూడరాదూ ఎల్లా మలుపుకుందో. సుఖంగా బతకటంకూడా రాసివుండాలి. మీ అమ్మకన్న అదృష్టమేఇదీ! లేకపోతే రాజాలాంటిబిడ్డ వాడికిదేంబుద్ధిఅంట? ఐనా రాసిపెట్టివుంటే ఆ పరమశివుడికే తప్పలేదు, మనమెంతటి వాళ్ళంలే. ఏ పాపిష్టివేళ పంపానో కొడుకుని ఈ బుద్ధి పుట్టింది అంటూ బుడిబుడిదీర్ఘాలు తీస్తూ మంచాన వరిగింది.

చీకటి పెరిగింది. కీచురాళ్ళు పాడుతున్నాయి. నక్షత్రాలు సభచేసి కంటతడి పెడుతున్నట్లు మెదుల్తున్నాయి.

తెల్లవారుతుంది. లోకంలో తను ఎవరిగా మిగలాలో తల్చుకుంటే బాధపెరుగుతోంది. మూర్తి పైన కసితో జీవించాలి. కాని కాలంజరిగి తను వంటరిగా మిగిలిస్తే; భయమేసింది. లోకంసానుభూతి తనకి ఎందుకు! పోనీ లోకం అంతా కలసితిట్టినా తనుభరిస్తుంది. కాని మూర్తితన పక్కనవుండాలి. మంటలమధ్య ఇరుక్కున్నమనిషి వెన్నెలరాత్రికోసం తపన చెందినట్టువుంది, భ్రాంతులు భూతాల్లా కదుల్తున్నాయి. చూరులో ఎలకలు కీచులాడుతున్నాయి. మళ్ళీవుత్తరంలోని అక్షరాలు కదులుతున్నాయి. నీసమ్మతిని తెలిపినట్లు వుత్తరం వ్రాయి. ఎంత తేలికగా వ్రాయకలిగారు. మళ్ళీ మనస్సుకసిగా వ్రాయకూడదని ఎదురుతిరిగింది. రాత్రిఅంతా మనస్సు జీవితాన్ని అనేకరకాల జీవితావశేషాలని కళ్ళముందు పరచింది. ఇందిరకి విరక్తిపుట్టింది. తెల్లవారుతోంది. వాకిలి వూడిచే చప్పుడు తలమీద బరికినంతబాధ కలిగింది. పెరట్లోకివెళ్ళింది. వెల్తురు నిర్మలంగా లేదు. తన మనస్సులాగే మసగ్గా వుంది. సుందరి సంసారంచూసి ఆనందించాలనిపించింది తనకెందుకని మనస్సు మందలిస్తోంది. పెరడంతా దిగులుగా తన్నిచూసి తలవాల్చినట్టు మంచంకింద పచ్చగా కదిలాయి. మూర్తి కోరికను మన్నించినట్టు వుత్తరంవ్రాసి తలగడకింద పెట్టింది.

అఖండంలా నీళ్ళగదిలో కట్టెలపొయ్యి మండుతోంది. మనస్సులో మంట పెరిగింది, కొంగుకంటుకుంది. కదల్లేదు కళ్ళు మూసుకుంది.

రత్తి అరుపులు, కనకమ్మ ఏడుపు మంటలా పెరిగి ఇరుగు పొరుగువారిని చేర్చింది.

ఇందిర చెవులకి చివరిమాటవినపడింది. 'పిల్లాడు తీసుకెడతానని వ్రాసిన వుత్తరం నిన్ననే వచ్చిందమ్మా' అంటూ కనకమ్మ వన్నెచిన్నెలతో విచారం బైటపడుతోంది.

'వుత్తరం' అంటూ అరచి, ప్రకృతిలోకి కాయితంలా ఎగిరిపోయింది ఇందిర.

ప్రాణంలేని పరిసరాలు హోరుమని మారు మ్రోగాయి...

✧